పరిశోధన సంస్థల్లో... గెజిటెడ్ ఆఫీసర్లు

దేశంలో పరిశోధనలకు చిరునామా.. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్). ఈ సంస్థకు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కార్యాలయాలు ఉన్నాయి. వాటిలో సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ హోదాల్లో 444 ఖాళీల భర్తీకి ప్రకటన వెలువడింది. సాధారణ డిగ్రీ విద్యార్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్షతో నియామకాలుంటాయి. అవకాశం వచ్చినవారికి గెజిటెడ్ స్థాయి, ఆకర్షణీయ వేతనాలు దక్కుతాయి. యూపీఎస్సీ, ఎస్ఎస్సీ, ఐబీపీఎస్.. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నవారు ఈ పోస్టులకు ప్రయత్నించవచ్చు!

స్వయం ప్రతిపత్తి సంస్థగా 1942లో సీఎస్ఐఆర్ ఏర్పాటైంది. ఇది కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. దేశంలో పరిశోధన, అభివృద్ధికి మాతృ సంస్థ సీఎస్ఐఆరే. దీని ఆధ్వర్యంలో 36 జాతీయ ప్రయోగశాలలు, 39 అవుట్‌రీచ్ కేంద్రాలు, ఒక ఇన్నోవేషన్ కాంప్లెక్స్, మరో మూడు పాన్ ఇండియా యూనిట్లు ఉన్నాయి. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఎంపికైనవారు వీటిలో ఎక్కడైనా విధులు నిర్వర్తించాలి. ఈ పోస్టులను కంబైన్డ్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీఏఎస్ఈ) ద్వారా భర్తీ చేస్తారు.

ముఖ్య సమాచారం

ఆన్‌లైన్ దరఖాస్తులు: జనవరి 12, 2024 సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారు.
దరఖాస్తు ఫీజు: మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు చెల్లించనవసరం లేదు. మిగిలినవారికి రూ.500.
పరీక్ష తేదీలు: ఫేజ్-1 ఫిబ్రవరిలో నిర్వహించవచ్చు. పేపర్-1, పేపర్-2లు విడిగా నిర్వహిస్తారా, ఒకేరోజు ఉంటాయా నిర్ణయం తీసుకోలేదు. ఆ తర్వాతే పేపర్-3 ఉంటుంది.
సమీపంలోని పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, భువనేశ్వర్.

వెబ్‌సైట్: https://www.csir.res.in/

ఖాళీలు.. అర్హతలు

సెక్షన్ ఆఫీసర్ గ్రూప్ బి (గెజిటెడ్)
ఖాళీలు: 76 **అర్హత:** ఏదైనా డిగ్రీ
వయసు: 33 ఏళ్లకు మించరాదు.
వేతన శ్రేణి: లెవెల్- 8. రూ.47,600 - 1,51,100. ఎంపికైనవారు మొదటి నెల నుంచే సుమారు రూ.85,000 అందుకోవచ్చు.

అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్
ఖాళీలు: 368. **అర్హత:** ఏదైనా డిగ్రీ
వయసు: 33 ఏళ్లకు మించరాదు.
వేతన శ్రేణి: లెవెల్-7. రూ.44,900 - 1,42,400. వీరు సుమారు రూ.80,000 పొందవచ్చు.
పై రెండు పోస్టులకూ గరిష్ఠ వయసులో ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు వారి కేటగిరీ ప్రకారం పది నుంచి పదిహేనేళ్ల సడలింపు వర్తిస్తుంది.

పరీక్ష ఇలా

రెండు పోస్టులకూ పరీక్షలు ఉమ్మడిగానే ఉంటాయి. మొత్తం 3 పేపర్లు. ఇవన్నీ ఇంగ్లిష్/ హిందీ మాధ్యమాల్లో ఉంటాయి.
పేపర్-1: జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్. దీనికి 150 మార్కులు. 150 ప్రశ్నలు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. తప్పు సమాధానానికి 0.33 మార్కులు తగ్గిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు. జనరల్ అవేర్‌నెస్‌లో వంద, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్‌లో 50 ప్రశ్నలు వస్తాయి. ఇవన్నీ ఆబ్జెక్టివ్ తరహాలోనే ఉంటాయి.
పేపర్-2: జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్ అండ్ మెంటల్ ఎబిలిటీ. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. దీనికి 200 మార్కులు. మొత్తం 200 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. తప్పు సమాధానానికి 0.33 మార్కులు తగ్గిస్తారు.
పేపర్-3: ఇంగ్లిష్/ హిందీ డిస్క్రిప్టివ్. దీనికి 150 మార్కులు. వ్యవధి 2 గంటలు. ఎస్సే, ప్రెసీ, లెటర్/అప్లికేషన్ రాయాలి.
సీపీటీ: అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారికే కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టు (సీపీటీ) నిర్వహిస్తారు. దీనికి వంద మార్కులు. ఇందులో అర్హత సాధిస్తే సరిపోతుంది. తుది ఎంపికలో ఈ మార్కులు పరిగణనలోకి తీసుకోరు.
ఇంటర్వ్యూ: సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారికి మాత్రమే వంద మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

ఎంపిక

సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు.. పేపర్-1, పేపర్-2లో చూపిన ప్రతిభతో పేపర్-3కి ఎంపిక చేస్తారు. ఈ మూడు పేపర్లలో సాధించిన మార్కుల మెరిట్ ప్రకారం ఇంటర్వ్యూకి పిలుస్తారు. తుది నియామకాలు మూడు పేపర్లు, ఇంటర్వ్యూల్లో సాధించిన మార్కుల మెరిట్, రిజర్వేషన్ ప్రకారం ఉంటాయి. అంటే మొత్తం 600 మార్కులనూ పరిగణనలోకి తీసుకుంటారు.
అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు.. పేపర్-1, పేపర్-2ల్లో చూపిన ప్రతిభతో పేపర్-3, సీపీటీకి ఎంపిక చేస్తారు. తుది నియామకాలు మూడు పేపర్లలో సాధించిన 500 మార్కుల మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఉంటాయి.

ఇదీ సిలబస్

పేపర్-1: జనరల్ అవేర్‌నెస్‌లో.. భారత దేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమం, భారత రాజ్యాంగం, రాజనీతిశాస్త్రం, ప్రభుత్వం, సామాజిక న్యాయం
జాతీయ, అంతర్జాతీయ వర్తమాన సంఘటనలు
ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్: కాంప్రహెన్షన్, యాక్టివ్-పాసివ్, డైరెక్ట్-ఇన్‌డైరెక్ట్, ప్రిపొజిషన్స్, ఫిల్ ఇన్ ది బ్లాంక్స్, సినానిమ్స్/యాంటనిమ్స్, సెంటెన్స్ కరెక్షన్, కామన్ ఎర్రర్స్, పంక్చువేషన్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్.
పేపర్-2: జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ నుంచి 25, అరిథ్‌మెటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ 25, జనరల్ సైన్స్ 25, ఎకనామిక్స్, సామాజిక అభివృద్ధి, పర్యావరణం, జీవవైవిధ్యం, వాతావరణ మార్పులు 25, ఎథిక్స్, ఇంటిగ్రిటీ, ఆప్టిట్యూడ్ 25, డెసిషన్ మేకింగ్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్ 25, మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్స్ అండ్ ప్రాక్టీసెస్ 25, జాతీయ భౌగోళికంలో 25 చొప్పున ప్రశ్నలు వస్తాయి.
పేపర్-3: ఎస్సే రైటింగ్‌లో రెండు ప్రశ్నలు రాయాలి. వీటికి వంద మార్కులు. ఒక ప్రెసీ రైటింగ్‌కు 30 మార్కులు. లెటర్/ అప్లికేషన్ రైటింగ్ ప్రశ్నకు 20 మార్కులు.

సన్నద్ధత ఎలా?

ప్రకటనలో సిలబస్ వివరాలు క్షుణ్ణంగా పేర్కొన్నారు. వాటిని శ్రద్ధగా గమనించాలి.

- ఈ పరీక్షకు సిద్ధమయ్యేవారు కొన్ని ఆకడమిక్ పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ రెండూ విస్తృతంగా చదవాలి.
- పేపర్-1లో విజయానికి ఇంటర్మీడియట్/ డిగ్రీ హిస్టరీ, పొలిటికల్ సైన్స్ పాఠ్యపుస్తకాల్లోని ముఖ్యాంశాలు బాగా అధ్యయనం చేయాలి. డిగ్రీలో ఈ సబ్జెక్టులను చదివినవారు ఎక్కువ స్కోరు పొందవచ్చు. అలాగే గ్రూప్స్ అభ్యర్థులకూ ఈ పేపర్ బాగా కలిసొస్తుంది.
- పేపర్-1లోనే వర్తమానాంశాల్లో ప్రశ్నలు వస్తాయి. జాతీయ స్థాయిలో.. ముఖ్య సంఘటనలు, పర్యావరణాంశాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, రాష్ట్రాల్లోని ముఖ్య పరిణామాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, క్రీడావార్తలు, నివేదికలు, కమిటీలు, కమిషన్లు, అవార్డులు, సన్మానాలు, ప్రముఖులు, విపత్తులు, దేశంలో మొదటి స్థానంలో ఉన్నవి... వీటిని బాగా చదవాలి.
- అంతర్జాతీయ స్థాయిలో.. ముఖ్య సమ్మేళనాలు, సంఘటనలు, ఇంటర్నేషనల్ అవార్డులు, ప్రపంచంలో ప్రథమం, అంతర్జాతీయ నాయకత్వం, అంతర్జాతీయ నివేదికలు, అంతర్జాతీయ కమిటీలు, సూచనలు, ప్రపంచంలోని ముఖ్య సంఘటనలు... వీటిని తెలుసుకోవాలి.
- ఈ పేపర్‌లోని ఇంగ్లిష్ లాంగ్వేజ్ కోసం నోటిఫికేషన్‌లో పేర్కొన్న అంశాలను ప్రామాణిక వ్యాకరణ పుస్తకం నుంచి అధ్యయనం చేయాలి. అలాగే యూపీఎస్సీ వివిధ పోటీ పరీక్షలకు నిర్వహిస్తోన్న జనరల్ ఇంగ్లిష్ ప్రశ్నపత్రాలు బాగా చదివితే ఎక్కువ మార్కులు పొందవచ్చు.
- పేపర్-2లో మేటి స్కోరు కోసం ఐబీపీఎస్, ఎస్ఎస్సీ నిర్వహిస్తోన్న పరీక్షల అరిథ్‌మెటిక్, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ అంశాలను బాగా చదవాలి.
- ఈ పేపర్‌లోని జనరల్ సైన్స్ అంశాలకోసం ఇంటర్మీడియట్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ పాఠాల్లోని ముఖ్యాంశాలను అధ్యయనం చేయాలి. డిగ్రీ/పీజీలో కంప్యూటర్ సైన్స్ నేపథ్యం ఉన్నవారు కంప్యూటర్/ఐటీ విభాగంలో ప్రశ్నలకు సులువుగానే సమాధానం ఇవ్వగలరు. మిగిలినవారు ప్రాథమికాంశాలు చదవాలి.
- ముఖ్యమైన ఆర్థికాంశాలు, కేంద్రప్రభుత్వ పథకాలు, పర్యావరణం, వాతావరణ సమతౌల్యానికి సంబంధించి దేశం చేస్తోన్న కృషి.. వీటిని తెలుసుకోవాలి. ఈ పేపర్‌లో భాగమైన ఎథిక్స్, డెసిషన్ మేకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ ప్రశ్నల సన్నద్ధతకు సివిల్స్ ప్రిలిమ్స్ సీశాట్ ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. ఎన్‌సీఈఆర్‌టీ 11, 12 తరగతుల జాగ్రఫీ పుస్తకాలు బాగా చదివితే ఆ విభాగంలో ప్రశ్నలకు జవాబులు గుర్తించవచ్చు.
- పేపర్-3లో విజయానికి ఇప్పటి నుంచే ఆంగ్లంలో వ్యాసాలు రాయడాన్ని సాధన చేయాలి. ద హిందూ/టైమ్స్ ఆఫ్ ఇండియాలో వచ్చే వ్యాసాలు చదివి, అందులోని ముఖ్యాంశాలను చూడకుండా రాయాలి. సమాచారం, భావ వ్యక్తీకరణ, భాషపై పట్టు కీలకం.
- సివిల్స్ ప్రిలిమ్స్ పేపర్-1, పేపర్-2 పాత ప్రశ్నపత్రాలను కనీసం ఆరేడు బాగా సాధన చేయాలి. అలాగే ప్రిలిమ్స్ మాదిరి ప్రశ్నపత్రాలు, మాక్ టెస్టులూ ఉపయోగమే.
- హిస్టరీ, పాలిటీ, ఎకానమీ, జనరల్ సైన్స్ అంశాలకు గ్రూప్-1, గ్రూప్-2 పాత ప్రశ్నపత్రాలూ బాగా చదివితే ఎక్కువ ప్రయోజనం.
- ఎస్ఎస్సీ సీజీఎల్, ఐబీపీఎస్ పీవో పాత, మాదిరి ప్రశ్నపత్రాలు సాధన చేస్తే అరిథ్‌మెటిక్, ఆప్టిట్యూడ్, రీజనింగ్, జనరల్ ఇంగ్లిష్ అంశాల్లో ఎక్కువ మార్కులకు అవకాశం ఉంది.
- భిన్న అంశాల్లో అవసరమైన పరిజ్ఞానం ఉన్నవారే ఈ పరీక్షలో విజేతలు కాగలరు. అందువల్ల పలు పోటీ పరీక్షల పాత ప్రశ్నపత్రాలు, మాదిరి ప్రశ్నలను సాధన చేస్తేనే విజయం దక్కుతుంది. అలాగే మాక్ టెస్టులూ రాయాలి.
- రుణాత్మక మార్కులు ఉన్నందున తెలియనివాటిని వదిలేయాలి.

నోటిఫికేషన్స్

ప్రభుత్వ ఉద్యోగాలు

ఇండియన్ బ్యాంకులో ...

ఇండియన్ బ్యాంక్, చెన్నై ఒప్పంద ప్రాతిపదికన సివిల్ ఇంజినీర్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
1. సివిల్ ఇంజినీర్ (లెవల్ 1): 2 పోస్టులు
2. సివిల్ ఇంజినీర్ (లెవల్ 2): 1 పోస్టు
అర్హత: బీఈ/ బీటెక్ (సివిల్ ఇంజినీరింగ్) **ఎంపిక:** రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, సైకోమెట్రిక్ టెస్ట్, ప్రెజెంటేషన్ తదితరాల ఆధారంగా.
వేతనం: ఏడాదికి లెవెల్ 1 పోస్టులకు రూ.9 లక్షలు/ లెవెల్ 2 పోస్టుకు రూ.12 లక్షలు. **పని ప్రదేశం:** చెన్నై, ముంబయి, కోల్‌కతా.
దరఖాస్తుకు చివరి తేదీ: 01.01.2024.
వెబ్‌సైట్: https://www.indianbank.in/career/

ట్రైనీ ఇంజినీర్ పోస్టులు

ఉత్తరాఖండ్ రాష్ట్రం దేహ్రాదూన్‌లోని ప్రభుత్వ రంగ సంస్థ- తెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (టీహెచ్‌డీసీ) స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా ఇంజినీర్ ట్రైనీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలచేసింది.
జూనియర్ ఇంజినీర్ ట్రైనీ (సివిల్ ఇంజినీరింగ్/ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్/ మెకానికల్ ఇంజినీరింగ్): 05 పోస్టులు
అర్హత: సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీఈ, బీటెక్
పే స్కేల్: నెలకు రూ.50,000- రూ.1,60,000.
ఎంపిక: గేట్ 2022 స్కోరు, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: జనరల్/ ఈడబ్ల్యూఎస్/ ఓబీసీ(ఎన్‌సీఎల్) అభ్యర్థులకు రూ.600. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికులకు ఫీజు లేదు.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ: 28-12-2023.
వెబ్‌సైట్: https://thdc.co.in/new-openings

ప్రవేశాలు

ఇఫ్లూలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) 2023-2024 విద్యా సంవత్సరానికి పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. హైదరాబాద్, షిల్లాంగ్, లఖ్‌నవూలోని ఇఫ్లూ క్యాంపసుల్లో ప్రవేశం పొందవచ్చు.

పీహెచ్‌డీ ప్రోగ్రామ్

విభాగాలు: ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఎడ్యుకేషన్, ఇంగ్లిష్ లిటరేచర్, లింగ్విస్టిక్స్ అండ్ ఫొనెటిక్స్, ఎడ్యుకేషన్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఇండియన్ అండ్ వరల్డ్ లిటరేచర్స్, హిందీ, అరబిక్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, ఫ్రెంచ్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, జర్మన్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, రష్యన్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, స్పానిష్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్.
అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ
ఎంపిక: ప్రవేశ పరీక్షలు, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: జనరల్/ ఓబీసీలకు రూ.500. ఎస్టీ/ ఎస్సీ/ దివ్యాంగులకు రూ.250.
దరఖాస్తుకు చివరి తేదీ: 31-12-2023.
వెబ్‌సైట్: https://www.efluniversity.ac.in/

దూరవిద్యలో వీలవుతుందా?

ఎలక్ట్రానిక్స్ డిప్లొమా పూర్తిచేశాను. ప్రస్తుతం చిన్న ఉద్యోగం చేస్తున్నా. దూరవిద్య ద్వారా ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ చేయొచ్చా? **- జేహెచ్ఎస్.ప్రసాద్**

ఇంజినీరింగ్, మెడిసిన్, లా, ఎంబీఏ లాంటి ప్రొఫెషనల్ కోర్సులను రెగ్యులర్‌గా చదివితేనే మెరుగైన ఉద్యోగావకాశాలు ఉంటాయి. అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) నిబంధనల ప్రకారం ఇంజినీరింగ్ కోర్సును దూరవిద్య ద్వారా చదవడం కుదరదు. కానీ మీరు ఈవెనింగ్ కళాశాలలో మూడు సంవత్సరాల ఇంజినీరింగ్ కోర్సును రెగ్యులర్‌గా చదివే అవకాశం ఉంది. కొన్ని యూనివర్సిటీలు మాత్రం సాయంకాలం బదులు శని/ ఆదివారాల్లో తరగతులు నిర్వహిస్తున్నాయి. బిట్స్ పిలానీ వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్స్‌లో భాగంగా ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో బీటెక్ డిగ్రీని ఆన్‌లైన్ పద్ధతిలో అందిస్తున్నారు. ఈ డిగ్రీకి యూజీసీ గుర్తింపు ఉంది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఏఎంఐఈ (అసోసియేట్ మెంబర్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్)/ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి కమ్యూనికేషన్స్ ఇంజినీర్స్ (ఐఈటీఈ) పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే, ఆ సర్టిఫికెట్ ఇంజినీరింగ్ డిగ్రీకి సమానం అవుతుంది. కానీ, ఆ రెండు పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం చాలా తక్కువ.

– ప్రా. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్

మార్కెట్ రిసెర్చ్

సంస్థ: ఫస్ట్ ప్లస్
స్టైపెండ్: నెలకు రూ.2,500-10,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 28
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఫైనాన్షియల్ మోడలింగ్, ఎంఎస్-ఎక్సెల్ నైపుణ్యాలు
internshala.com/i/f14cb5

ఫొటోగ్రఫీ

సంస్థ: అవారీ
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 27
అర్హతలు: అడోబ్ ఫొటోషాప్, ఫొటోషాప్ లైట్ రూమ్ సీసీ, ఫొటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ నైపుణ్యాలు
internshala.com/i/1cd3b2

హైదరాబాద్‌లో

యాంగ్యులర్.జేఎస్ డెవలప్‌మెంట్

సంస్థ: ఇన్‌క్రా సాఫ్ట్
స్టైపెండ్: నెలకు రూ.8,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 25
అర్హతలు: యాంగ్యులర్ 7.0, సీఎస్ఎస్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్ నైపుణ్యాలు
internshala.com/i/d7e8c3

వీడియోగ్రఫీ

సంస్థ: ఎస్‌జీమొయిడ్
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 25
అర్హతలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, కేన్వా, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఫైనల్ కట్ ప్రో, ఫొటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ నైపుణ్యాలు
internshala.com/i/235d4b

మెకానికల్ ఇంజినీరింగ్

సంస్థ: గరుడ 3డీ
స్టైపెండ్: నెలకు రూ.8,000-10,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 28
అర్హతలు: ఆటోక్యాడ్, ఆటోడెస్క్ ఫ్యూజన్ 360, ర్యాపిడ్ ప్రోటోటైపింగ్ నైపుణ్యాలు
internshala.com/i/8e5fb7

టెలికాలింగ్

సంస్థ: సింప్లిఫై సొల్యూషన్స్
స్టైపెండ్: నెలకు రూ.4,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 27
అర్హతలు: టెలికాలింగ్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
internshala.com/i/de6b36

కొక్కు ప్రాపర్టెక్

1. కస్టమర్ సర్వీస్
స్టైపెండ్: నెలకు రూ.2,000-2,5000
దరఖాస్తు గడువు: డిసెంబరు 26
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటం, ఎంఎస్-ఎక్సెల్, ప్రాబ్లమ్ సాల్వింగ్, టైమ్ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు
internshala.com/i/c9af4a

2. డిజిటల్ మార్కెటింగ్
స్టైపెండ్: నెలకు రూ.2,000-3,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 26
అర్హతలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, ఈమెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ రాయడం, ఎస్ఈఓ, ఎస్ఈఓ నైపుణ్యాలు
internshala.com/i/7b451a

3. పబ్లిక్ రిలేషన్స్ అండ్ కంటెంట్ మార్కెటింగ్
స్టైపెండ్: నెలకు రూ.2,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 27
అర్హతలు: కంటెంట్ మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్, క్రియేటివ్ రైటింగ్, టైమ్ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు internshala.com/i/886ddd

వీడియో యాంకరింగ్ (రీల్స్/షార్ట్స్)

సంస్థ: హాట్‌నాట్
స్టైపెండ్: నెలకు రూ.2,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 28
అర్హతలు: యాంకరింగ్, కంటెంట్, ఇన్‌స్టాగ్రామ్ మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, మార్కెటింగ్ క్యాంపైన్స్ నైపుణ్యాలు
internshala.com/i/e69e24

జనరల్ మేనేజ్‌మెంట్

సంస్థ: డిజిబ్రోస్
స్టైపెండ్: నెలకు రూ.12,000-18,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 26
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటం, మార్కెట్ రిసెర్చ్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-పవర్ పాయింట్, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
internshala.com/i/22fefa

కష్టపడుతున్నా మార్కులు రావడం లేదా?

'పరీక్షలు ఎంత బాగా రాసినా మార్కులు మాత్రం ఊహించిన దాని కంటే తక్కువే వస్తున్నాయి. సమయాన్ని ఏమాత్రం వృథా చేయకుండా చదివినా ఫలితం దక్కడంలేదు' అని కొందరు విద్యార్థులు వాపోతుంటారు. అలాంటివారిలో మీరూ ఉన్నారా... అయితే ఈ అంశాలను ఒకసారి గమనించండి.

కొన్ని సబ్జెక్టుల్లో ఎక్కువ మార్కులు వస్తాయని ముందుగానే ఊహించారు. కానీ ఫలితం మాత్రం అందుకు భిన్నంగా వచ్చింది. ముందుగా మీరు దీన్ని అంగీకరించి తీరాలి. అలాగే ఆ సబ్జెక్టుల్లోనే మీ స్నేహితులకు ఎక్కువ మార్కులూ వచ్చి ఉండొచ్చు. అంటే మీకంటే వాళ్లకు విషయ పరిజ్ఞానం ఎక్కువగా ఉందనే నిజాన్నీ గుర్తించాలి. ఏయే అంశాల్లో బలహీనంగా ఉన్నారో తెలుసుకుని.. అదనపు సమయాన్ని కేటాయించడం ద్వారా వాటిపై పట్టు సాధించడానికి ప్రయత్నించాలి.

1 చాలామంది విద్యార్థులు సాధారణంగా పరీక్షల్లో ఎక్కువ మార్కులు సంపాదించడమే ధ్యేయంగా చదువుతారు. కాన్సెప్ట్‌లు, థియరీలను అర్థంచేసుకుంటూ చదవాలనే విషయం మీద అసలు దృష్టిపెట్టరు. కొన్నిసార్లు ప్రాథమిక అంశాలనూ దాటవేస్తుంటారు కూడా. దీంతో పునాది బలహీనంగా ఉండి.. అడ్వాన్స్‌డ్ దశలోని పాఠాలను అర్థంచేసుకోవడానికి ఎంతో కష్టపడాల్సి వస్తుంది. విషయాన్ని మొక్కుబడిగా జ్ఞాపకం పెట్టుకోవడం కంటే.. అర్థంచేసుకుంటూ చదవడమే ముఖ్యం. అలాకాకుండా ఎన్ని గంటలపాటు చదివినా ప్రయోజనం ఉండదు. చదివినదాన్ని స్నేహితులకు వివరించి చెప్పగలిగారంటే దానిపైన మీరు పట్టుసాధించినట్టే.

2 ఎన్ని గంటలపాటు చదివారు అనే దానికంటే ఎంత ఏకాగ్రతతో చదివారనేదే ముఖ్యం. ముందుగా ఏ సబ్జెక్టుకు ఎంత సమయాన్ని కేటాయించాలనేది టైమ్‌టేబుల్ వేసుకోవాలి. దాన్ని కచ్చితంగా అమలు చేయడానికి ప్రయత్నించాలి. మర్నాటికి వాయిదా వేయాలనుకోవడం వల్ల తర్వాత అదే అలవాటుగా మారే ప్రమాదమూ ఉంటుంది.

3 చదివినవి ఎంత వరకూ అర్థమయ్యాయో తెలుసుకునేందుకు.. ప్రశ్నలు వేసుకోవడం, సమీక్షించుకోవడం, అవసరమైతే మరోసారి చదవడం లాంటి చిట్కాలు ఉపయోగపడతాయి. అలాగే చదివేటప్పుడు మధ్యలో కాసేపు విరామం తీసుకోవడం వల్ల కూడా ఉపయోగం ఉంటుంది. ఆ సమయంలోనూ కూర్చుని ఉండకుండా కాస్త అటూఇటూ నడవచ్చు. అలసిపోయినట్టుగా అనిపిస్తే కళ్లు మూసుకుని కాసేపు సేదతీరినా ప్రశాంతంగా ఉంటుంది.

4 పరీక్షల్లో ఎక్కువ మార్కులు సంపాదించాలంటే.. చేతిరాతా బాగుండాలనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. అంటే అక్షరాలు గుండ్రంగా, అందంగా ముత్యాల్లా ఉండి.. చూడగానే అందర్నీ ఆకర్షించాలని కాదు. రాసింది స్పష్టంగా, అర్థమయ్యేలా ఉంటే సమాధాన పత్రాలు దిద్దేవారికీ ఇబ్బంది ఉండదు. అసలు మీరేం రాశారో అర్థమేకానప్పుడు మార్కులు వేయడమూ కష్టమే కదా. అలాగే త్వరగా సమాధానాలన్నీ రాయాలనే కంగారులో.. అస్పష్టంగా, గజిబిజిగా రాయడం, అక్షరాలను పదే పదే కొట్టివేయడం లాంటివీ చేయకూడదు.



5 కొంతమంది పరీక్ష ముందు రోజే మొత్తం పాఠాలను చదవాలనుకుంటారు. సమాచారాన్ని అంతా ఒకేసారి బుర్రలో నిక్షిప్తం చేసుకోవాలనుకుంటారు. దీనివల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. అంతేకాదు నిద్రలేమితోపాటు, ఒత్తిడికి గురికావడం వల్ల ఇబ్బందిపడుతూ.. మర్నాడు పరీక్ష సరిగా రాయలేకపోవచ్చు కూడా.

6 కొందరు విద్యార్థులు పాఠ ప్రశ్నపత్రాల్లోని ప్రశ్నలు ముఖ్యమైనవి అనుకుని.. వాటిని మాత్రమే చదువుకుంటే సరిపోతుంది అనుకుంటారు. నిజానికి ఇవి ముఖ్యమైనవే అయినప్పటికీ వీటినే చదవడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. ప్రతి పాఠం చివర ఇచ్చే ప్రశ్నలన్నింటినీ చదవాలి. దీంతో ప్రశ్నలను మార్చి వేరే విధంగా అడిగినా కంగారుపడకుండా సమాధానాలు రాయగలుగుతారు.

7 ఒకేసారి పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకుని.. ఆ తర్వాత ఎంత కష్టపడినా దాన్ని సాధించలేకపోయామని బాధపడకూడదు. అలాగే ఆశించిన ఫలితాలు రాకపోయినా ప్రతికూల ఆలోచనలను దరిచేరనీయకూడదు. దశలవారీగా లక్ష్యసాధనకు కృషిచేయాలి.